సాక్షి చిత్తూరు

7

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



సరస్వతీ..నమోస్తుతే!

దసరా మహోత్సవాలు అంగ రంగ వైభవంగా సాగుతున్నాయి. ఏడో రోజు అయిన సోమవారం బోయకొండ గంగమ్మ చదువుల తల్లి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఉత్సవమూర్తి ఎదుట ఈఓ ఏకాంబరం తోపాటు ఉభయదారులు ప్రత్యేక హోమ పూజలు, పూర్ణాహుతి నిర్వహించారు.

చౌడేపల్లె

వైభవోత్సవం

- హనుమంత, స్వర్ణరథం, గజవాహనంపై అభయం

బ్రహ్మాండ నాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువలా సాగుతున్నాయి. సోమవారం ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజవాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. దేవదేవుని దివ్యమంగళరూపాన్ని దర్శించుకున్న భక్తులు దివ్యానుభూతిని పొందారు. వాహన సేవల్లో కళాకారుల నృత్యాలు, కోలాటాలు, భజన బృందాల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భద్రతా సిబ్బంది హడావుడి ఏ మాత్రం తగ్గలేదు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

– తిరుమల



స్వర్ణ రథంపై దేవదేవుడు

గజ వాహనంపై ఊరేగుతున్న మలయప్ప

హనుమంత వాహనంపై కోదండరాముడు

న్యూస్‌రీల్

పట్టాలు తప్పిన రైలు ఇంజిన్



మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండలం, కొత్తకోట పంచాయతీ పరిధిలోని మోటకంపల్లి వద్ద రైల్వే విద్యుత్ లైన్లు తనిఖీ చేసే రైలింజిన్ అదుపుతప్పింది. వివరాలు.. సోమ వారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో చిత్తూరు–తిరుపతి రైల్వే మార్గంలో విద్యుత్ లైన్ల పరిశీలన నిమిత్తం ఓ ఈహెచ్‌ఈ ఇన్‌స్పెక్షన్ కారు వెళ్తోంది. ఇంజిన్ నడుపుతున్న లోకోపైలెట్ అజాగ్రత్త వల్ల పట్టాలు తప్పింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కాగా ఈ ఘట న కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో విధి లేని పరిస్థితుల్లో దారి మళ్లించారు. రైల్వే అధికారులు ఘటనా స్థలికి చేరు కుని మరమ్మతులు చేయిస్తున్నారు.

శిక్షణకు హాజరుకావాల్సిందే



వరలక్ష్మి, డీఈవో

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపికైన నూతన టీచర్లు తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాల్సిందేనని డీఈవో వరలక్ష్మి చెప్పారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీలో ఎంపికైన నూతన టీచర్లకు అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు అక్టోబర్ 3 ఉదయం 7 గంటలకు తమకు కేటాయించిన శిక్షణ కేంద్రాల్లో హాజరుకావాలన్నారు. వంద శాతం హాజరు తప్పనిసరి అన్నారు. లేటెస్ట్ ఆండ్రాయిడ్ ఫోన్, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లను తీసుకురావాలన్నారు. చిత్తూరు జిల్లాలోని ఎస్వీ ఫార్మసీ (ఆర్వీఎస్ నగర్, చిత్తూరు), ఆర్కే పాఠశాల (కట్టమంచి, చిత్తూరు), ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ (చిగురువాడ, తిరుపతి), విశ్వం స్కూల్ (జీవకోన, తిరుపతి), మెఢ్జీ స్కూల్ (తిరుపతి), ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల (బైపాస్‌రోడ్డు, గూడూరు)లో శిక్షణ ఉంటుందని డీఈవో వెల్లడించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు స్టెతస్కోప్‌ని పక్కనబెట్టి సమ్మె బాట పట్టారు. జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లల్లో సోమవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేశారు. అత్యవసర సేవలకు మాత్రం చికిత్స చేశారు. నల్ల రిబ్బన్ ధరించి విధులకు హాజరయ్యారు. ఆన్‌లైన్ సేవలు, రిపోర్టుల సమర్పణకు బంద్ పాటించారు. దీంతో పలు సేవలు స్తంభించారు. పలుచోట్ల రోగులు ఆరోగ్య సేవలకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడి న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చకపోతే పూర్తి స్థాయిలో విధుల బహిష్కరణకు సైతం వెనుకాడేది లేదని వైద్యులు హెచ్చరించారు.

రోగుల నెత్తిన సమ్మెట!



బోసిపోయిన యాదమరి పీహెచ్‌సీ

- డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళనబాట పట్టిన వైద్యులు
- పలు చోట్ల ఓపీ సేవలు బంద్
- అత్యవసర కేసులకు మాత్రమే చికిత్స
- ఆపసోపాలు పడిన రోగులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనబాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు నిలిపివేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలో 50 పీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లున్నాయి. ఏపీపీహెచ్‌సీడీఏ పిలుపు మేరకు పలు పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు సమ్మె పాటించారు. నల్ల రిబ్బన్ ధరించి విధుల్లోకి వెళ్లారు. ఓపీ సేవలను పక్కన పెట్టారు. అత్యవసర కేసులకు మాత్రమే చికిత్స అందించారు. ఓపీ వివరాలు, ఇతరాత్ర నివేదికలు ఆన్‌లైన్ చేయడానికి నిరాకరించారు. పలు చోట్ల ఓపీలు చూడకపోవడంతో రోగులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. ఆపై డాక్టర్లే సేవాభావంతో చికిత్స అందించారు. మందులు, మాత్రలు ఇచ్చి పంపారు. సమ్మె ప్రభావంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సమ్మె విషయం ప్రజల్లోకి చేరడంతో చాలా మంది పీహెచ్‌సీలకు రాకుండా పట్టణం బాట పట్టారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ఈ సమ్మె రోగులకు గుదిబండగా మారనుంది.

సీనియర్లకు అన్యాయం

2020–22 మధ్య ఉద్యోగంలో చేరిన వైద్యులకు ఇప్పటికీ రూ.53,500 జీతం ఇస్తున్నారు. 2023లో నియమితులైన ఫ్రెషర్లకు రూ.80 వేల నుంచి రూ.90 వేల పేస్కేల్ అమలు చేస్తున్నారు. సీనియర్లు అన్యాయానికి గురవుతున్నారు. తమ జీతాలను తాజా పేస్కేలో సమానం చేసి, పెండింగ్ జీతాన్ని నోషనల్ ఇంక్రిమెంట్ల కింద చెల్లించాలని కోరుతున్నారు. గత ఏడాది ఇదే నెలలో వైద్యులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామని అప్పట్లో కూటమి నాయకులు, అధికారులు చెప్పారు. తీరా నిరసన విరమించాక పట్టించుకోలేదు. చంద్రన్న సంచార చికిత్స వాహనంలో తిరిగి సేవలందిస్తున్నందుకు ప్రతి నెలా అదనంగా రూ.5 వేలు చెల్లించాలని కోరుతున్నారు.

ఆందోళన కార్యక్రమం ఇలా..

ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ వైద్యుల సంఘం (ఏపీపీహెచ్‌సీడీఏ) పిలుపు మేరకు వైద్యులు సమ్మె బాటపట్టారు. దీన్ని దశల వారీగా నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు శిరీష, చంద్రమహేష్ తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా నల్ల రిబ్బన్లతో నిరసన ఉంటాయన్నారు. మంగళవారం జిల్లా కేంద్రాల్లో నిరసన, వచ్చే నెల 1న ప్లకార్డులతో జిల్లా కేంద్రంలో ర్యాలీ, ధర్నా నిర్వహిస్తామన్నారు. 2న విజయవాడకు దీక్ష యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. 3న నిరాహార దీక్ష చేపడతామన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా సహా తమ సమస్యలన్నీ తక్షణమే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఉద్యమిస్తామని వారు పేర్కొన్నారు.

ఇన్ని నిబంధనలా?

వైద్య వృత్తిలో ఎదుగుదల లేదంటే పీజీ చదవడం దేనికని పీహెచ్‌సీల వైద్యులు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలో చేరే ఉద్యోగికి కూడా ఇన్ని షరతులు ఉండవని వాపోతున్నారు. ఈ నిబంధనలు సడలించాలని కోరుతున్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న వైద్యాధికారులకు 20 ఏళ్లుగా పదోన్నతులు లేవు. వారికి పదోన్నతులిస్తామని ఎన్నికల వేళ అసోసియేషన్ నాయకులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇప్పుడు ఆ విషయం ప్రస్తావిస్తే కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటోందని వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ వేళ అత్యవసర పరిస్థితిలో చేరి, ప్రాణాలకు తెగించి మరీ రోగులకు వైద్య సేవలందించిన తమపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని మండిపడుతున్నారు.



బొమ్మసముద్రంలో మందులు, మాత్రల కోసం క్యూలో వేచి ఉన్న రోగులు

డాక్టర్ల డిమాండ్లు

- సర్వీస్‌లో ఉన్న మెడికల్ ఆఫీసర్లకు గతంలో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ రిజర్వేషన్ ఉండేది.
- ప్రభుత్వం జీఓ నం.85 ద్వారా ఈ కోటాను 15, 30 శాతానికి కుదించింది.
- ఈ ఏడాది జీఓ నం.99 ద్వారా ఆరు బ్రాంచ్‌ల నిబంధన తెర మీదికి తెచ్చింది. దీని ప్రకారం 15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్థీషియా బ్రాంచ్‌లకు మాత్రమే వర్తింపజేసింది. ఈ అన్యాయాన్ని వైద్యులు ఏడాది కాలంగా ప్రశ్నిస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు.
- ఎంబీబీఎస్ చదివి వైద్యాధికారిగా నియమితులైన వారు పీజీ చదువుకోవడానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టింది.
- రూ.50 లక్షల ష్యూరిటీ ఇవ్వాలని, కనీసం పదేళ్ల ప్రభుత్వ సర్వీసులో అదే హోదాలో పనిచేస్తామంటూ బాండ్ రాయాలని హుకుం జారీ చేఇసంది.
- మెడిసిన్ చదివిన ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ప్రభుత్వం తన వద్ద హామీగా పెట్టుకుంటోంది.

డాక్టర్ లేదు



శరీరం అంతా నవలుగా ఉంటే ధర్మాస్పత్రికి వచ్చాను. కానీ ఇక్కడ పెద్ద డాక్టరు లేరు. నర్సమ్మ దగ్గర చూపించుకున్నాను. వాళ్ల ఏదో కొన్ని మందులు ఇచ్చారు. నయం కాలేదంటే చిత్తూరులో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి నా వొళ్లు భాగుచేయించుకుంటాను. డాక్టర్లకు కూడా న్యాయం చేస్తే బాగుంటుంది.

– వరదయ్య, కీనాటంపల్లి, యాదమరి


కాలు వాపుతో ఇబ్బంది



గత రెండు రోజులుగా కాలు వాపుతో ఇబ్బంది పడుతున్నా. ఈ రోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే డాక్టర్ సమ్మెలో ఉన్నాం.. అత్యవసర వైద్య పరీక్షలు మాత్రమే చూస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రికి పోయేస్తోమత లేక పీహెచ్‌సీలో నర్స్ దగ్గర ఇంజక్షన్ వేయించుకొని, కాలు వాపునకు మాత్రలు తీసుకున్నా. డాక్టర్లు సమ్మెలో ఉంటే మాలాంటి పేదవారు వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలి.

–హరి, ఐరాల

వైద్య విద్య..అందని ద్రాక్ష



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వంలో వైద్య విద్య పేదలకు అందని ద్రాక్షలా మారిందని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేటు పరం చేసి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడం రివాజుగా మారుతోందన్నారు. 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తన లబ్ధి కోసం పెత్తందారుల చేతిలో పెట్టిన ఘనత చంద్రబాబుదేనన్నారు. నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రి అయినప్పటికీ ఒక్క మెడికల్ కళాశాలను తీసుకు రాలేక పోయాడని ఎద్దేవాచేశారు. అధికారం చేపట్టిన 15 నెలలకే అన్ని రంగాల అధికారులు, విద్యార్థులు నిరసన సెగలు తెలుపుతున్నా బాధ్యతగల పదవిలో ఉంటున్న చంద్రబాబు పట్టించుకోకపోవడ దారుణమన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,496 మంది స్వామివారిని దర్శించుకున్నారు 29,591 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.79 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో తిరుమలేశుని దర్శించుకోగలగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలైలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

సెలవు దినం అయినా..

చిత్తూరు కార్పొరేషన్ : ప్రజల సౌకర్యార్థం ఈనెల 30న ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు పనిచేస్తాయని విద్యుత్ శాఖ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు డివిజన్ పరిధిలోని అన్ని వసూలు కేంద్రాలు మంగళవారం యథావిధిగా పనిచేస్తాయన్నారు.

- ఎంపీ మిథున్‌కు బెయిల్‌పై సంబరాలు
- జిల్లా వ్యాప్తంగా మిన్నంటిన కార్యక్రమాలు
- కూటమి అక్రమ అరెస్టులకు భయపడమంటూ నినాదాలు

న్యాయం గెలిచింది!



కల్లూరు: సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు



పుంగనూరు: స్వీట్లు పంపిణీ చేస్తున్న నేతలు

పుంగనూరు: అక్రమ మద్యం కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంపై జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. కూటమి కుట్రలు, కుతంత్రాలకు కోర్టులు కళ్లెం వేస్తున్నాయని, న్యాయపోరాటంలో అంతిమ విజ యం మిథున్ అన్నదే అని నినాదాలు మిన్నంటించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, మిథున్‌రెడ్డి యువసేన అధ్యక్షుడు రాజేష్ ల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. సోమ వారం ఎంపీ మిథున్‌రెడ్డికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై పట్టణంలోని బస్టాండ్‌లో గల రాజన్న విగ్రహం వద్ద అభిమానులు మిఠాయిలకు పంపిణీ చేశారు. అలాగే ఇందిరా సర్కిల్‌లో బాణసంచా పేల్చారు. పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, పట్టణ బలిజ సంఘ నాయకుడు కొండవీటి నరేష్, కౌన్సిలర్ కాళిదాసు, నాయకులు అజ్మా, గౌసి, నూర్, మమ్ము, అస్లాంమురాధి, నజీ ర్, అఫ్సర్, జావీద్, బావాజాన్, జవహర్, సిద్ధిక్, ఆయాజ్, నయాజ్, జిమ్ ఇర్ఫాన్, అజీజ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సంబరాలు


పులిచెర్ల(కల్లూరు): ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంపై మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. న్యాయం గెలిచిందన్నారు. మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, మాజీ జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి, ఎన్ఎస్ రెడ్డి ప్రకాష్, మువ్వల నరశింహులుశెట్టి, రెడ్డి అహమ్మద్, నిరంజన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రాయల్‌మోహన్, గోవిందరెడ్డి, సౌకత్, మునస్వామి, మునీశ్వర, విజయకుమార్, శ్రీనివాసులు, మునీర్‌ఖాన్, కోదండ సైదుల్లా, అమీన్, రాజారెడ్డి, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా వస్తారు



చిత్తూరు అర్బన్: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి న్యాయస్థానం బెయిల్ ఇవ్వడంపై వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త హర్షం వ్యక్తం చేశారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలో బయటకు వస్తారని చెప్పారు. కూటమి చేసే ప్రతి తప్పులను జగన్‌మోహన్‌రెడ్డి లెక్కిస్తూనే ఉన్నారన్నారు.

న్యాయం గెలిచింది



శ్రీరంగరాజపురం : 'న్యాయం గెలిచింది. కూటమి ప్రభుత్వానికి చెంప దెబ్బ పడింది' అని మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. పుత్తూరులోని ఆయన నివాసంలో మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఏర్పడిందని చెప్పారు.

ప్రజలకు ముందస్తు దసరా



యాదమరి: జిల్లాలో ముందస్తు దసరా వచ్చిందని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డా.సునీల్‌కుమార్ అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేయడంతో తన ఆనందాన్ని వెలిబుచ్చారు. ప్రజాసమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉంటున్నారనే నెపంతో చంద్రబాబు ప్రభుత్వం అక్రమంగా కేసు బనాయించిందన్నారు. ఈ రోజు రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా దసరా, దీపావళి వచ్చిందన్నారు. యాదమరి మండలంలో ఎంపీపీ సురేష్‌బాబు, కోనాపల్లి మనోహర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు.

విజయం న్యాయానిదే



శాంతిపురం: జరగని నేరాలపై ఆధారాలు లేని కేసు నమోదు చేసిన కూటమి ప్రభుత్వంపై న్యాయమే విజయం సాధిస్తుందని ఎమ్మెల్సీ, కుప్పం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ భరత్ అన్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్‌పై విడుదల కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. హామీలు అమలుకు ప్రాధాన్యత కల్పించని కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మారల్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఎవరెన్ని తప్పుడు కేసులు పెట్టినా అంతిమ విజయం న్యాయానిదే అన్నారు.

క్లుప్తంగా

పోలీసు గ్రీవెన్స్‌కు 41 ఫిర్యాదులు



సమస్యలు వింటున్న డీఎస్పీ

చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 41 వినతులు అందాయి. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్దేశిత గడువులోపు పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలు ఫిర్యాదులపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ హౌస్ అధికారులతో మాట్లాడారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, వన్‌టౌన్ సీఐ మహేశ్వర సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను అందుకున్నారు.

ఆధిపత్య రగడ



రాజనాలబండలో సమావేశమైన గ్రామస్తులు

చౌడేపల్లె: ఆలయ ఆవిర్భావ వంశస్తులకు, దాత మధ్య మండలంలోని గాండ్లపల్లె అభయాంజనేయస్వామి దేవస్థానం నిర్వాహక ఆధిపత్య రగడ సాగుతోంది. ఈ వివాదం సోమవారం సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండకు చేరింది. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడికి చేరుకొని నిర్వహణ అర్హతపై చర్చించారు. ఇందులో వెలుగుచూపిన అంశాలు మూడు తరాల క్రితం దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని గాండ్లపల్లెకు చెందిన జమ్మలమడుగు పెద్ద రామాంజులమ్మ, వెంకటస్వామి దంపతులకు ఏళ్ల తరబడి సంతానం లేదు. స్వామీజీ వద్దకు శాస్త్రానికి వెళ్లగా ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించి పూజలు చేయాలని సెలవించారు. స్వామీజీ సూచనల మేరకు గ్రామపంచాయతీలోని చెన్నకేశ్వరస్వామి మాన్యం భూమిలో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి వారి వంశస్తులే ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణకర్త మనవడు జమ్మల మడుగు హరినాథ్ బాధ్యతలు చూస్తున్నారు. ఇలా ఉండగా 2007లో అదే పంచాయతీకి చెందిన దాత గిరినాథప్రకాష్ గ్రామ పెద్దల వద్ద అనుమతి తీసుకొని ఆలయానికి ప్రాకారం నిర్మించారు. కొంత కాలంగా ఆలయంపై దాత ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తూ కొంతమంది ద్వారా వివాదాలు సృష్టిస్తున్నారు. నిర్వాహకులు, దాత మధ్య వివాదం పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాకారం నిర్మాణం చేపట్టిన సమయంలోనే పెద్దల సమక్షంలో కలిసి నిజానిజాలను అందరి అభిప్రాయాలను రికార్డు చేశారు. అనాదిగా ఆలయ నిర్మాణానికి కారణమైన వారి వంశుస్తులకే నిర్వహణ భాధ్యత ఉంటుందని అందరూ అభిప్రాయపడ్డారు. గాండ్లపల్లెకు చెంది పుంగనూరులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బగ్గిడిగోపాల్, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ సరస్వతమ్మ పాల్గొన్నారు.

సెలవులో డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మోహన్‌కుమార్ వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవు పెట్టారు. అక్టోబర్ 2 వరకు ఆయన సెలవు పెట్టడంతో ఇన్‌చార్జి బాధ్యతలను డిప్యూటీ కలెక్టర్ కేడర్ అధికారికి అప్పగించారు. కలెక్టరేట్‌లో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కుసుమకుమారికి ఇన్‌చార్జ్ డీఆర్‌వోగా బాధ్యతలప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

భూ కబ్జాలో తోపు!



ఈతతోపులో ఆక్రమణకు గురైన గుట్ట

ఓ టీడీపీ నేత భూకబ్జాలో తోపు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈత తోపులోని గుట్ట భూమిపై కన్నేశాడు. దొడ్డిదారిన భూదోపిడీకి సిద్ధపడ్డాడు. జేసీబీతో గుట్టను చదును చేశాడు. ఆక్రమిత భూమికి అడ్డుగా ఉన్న వంక పోరంబోకును పూడ్చేశాడు. అడిగిన వారికి రూ.20 లక్షలతో కొనుగోలు చేశానని బుకాయించాడు. ఆక్రమిత భూమిని అమ్మకానికి పెట్టాడు. ఈ భూదందాపై ఏ ఒక్కరూ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- తాళంబేడు ఈత తోపులో టీడీపీనేత భూ ఆక్రమణ
- 12 ఎకరాల గుట్ట భూమి అన్యాక్రాంతం
- రూ.20 లక్షలతో కొనుగోలు చేసినట్లు ప్రచారం
- జేసీబీలతో గుట్ట చదును, వంకపోరంబోకు పూడ్చివేత
- ఆక్రమిత భూమి ఎకరా రూ.5 లక్షల విక్రయానికి పెట్టిన వైనం
- పట్టనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం 5.వెంకటాపురం రెవెన్యూలోని ఈతతోపులో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల కన్ను ఈ భూములపై పడింది. గుట్ట, వంక, మేత భూములను వదలకుండా తమ అధీనంలోకి తెచ్చుకోవాలని స్కెచ్ వేశారు. ఈ క్రమంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూ ఆక్రమణకు తెరలేపారు. కొన్ని ఎకరాల భూమిని కొట్టేస్తున్నారు. ఆ తర్వాత అమ్మకాని పెడుతున్నారు.

దొడ్డిదారిలో భూ దోపిడీ

చిత్తూరు మండలం, తాళంబేడు పంచాయతీ, దొడ్డి అనంతాపురం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత ప్రభుత్వ భూములను కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్నాడు. ఇప్పటికే 9 ఎకరాల గుట్ట భూమి, మూడు ఎకరాల వంక పోరంబోకును దొడ్డిదారిన దోచేశాడు. జేసీబీలు తీసుకెళ్లి గత వారం రోజులుగా ఆ భూములను చదును చేశాడు. వర్షపు నీరు వెళ్లే వంక పోరంబోకును కూడా పూర్తిగా పూడ్చేశాడు. మొత్తం 12 ఎకరాల భూమికి రాళ్లు పాతేశాడు. ఆపై అమ్మకానికి పూనుకున్నాడు.

ఎకరా రూ.3 లక్షలట

భూమి చదును చేసే క్రమంలో ఆ టీడీపీ నేతను కొంతమంది ప్రశ్నించారు. అందుకు ఆ నేత రూ.20 లక్షలిచ్చి 12 ఎకరాల భూమిని కొనుగోలు చేశానని బుకాయించాడు. రూ.2లక్షలు ఇచ్చి పట్టా చేసుకున్నట్లు వారిని నమ్మించాడు. దీంతో గుట్ట, వంక భూములకు పట్టాలు ఎలా అని ప్రశ్నించిన వ్యక్తులకు అనుమానం కలిగింది. భూమి చదును చేసిన తర్వాత ఎకరా రూ.5 లక్షలంటూ బేరానికి దిగాడు. ఎవరైనా అడిగితే చదును చేసిన భూమిని ఇచ్చేస్తానని డప్పుకొట్టాడు. అయితే ఆ గుట్ట భూమికి పట్టాలేవని, పూర్తిగా ఆక్రమించేశారని గ్రామస్తులు తెలుసుకున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూ ఆక్రమణలు కోకొల్లలుగా సాగుతున్నాయి. గుట్టలు, మేత భూములు, వంకలు, వాగులు, చెరువు భూములను సైతం మింగేస్తున్నారు. ఈ ఆక్రమణలు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఆక్రమణలను పూర్తిగా కప్పి పుచ్చేస్తూ.. ఆక్రమణదారులకు వారు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా భూ ఆక్రమణపై ఫిర్యాదు చేస్తే ×ఎవుడు యా నీవు¥ అంటూ నోరు మూయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫీల్డ్‌లో చూస్తాం



మా వీఆర్వో ఆనందనాయుడిని అక్కడి పంపించాం. ఎక్కడా లేదంటున్నాడు. నేనే ఫీల్డ్‌కు వెళతాను. చూస్తాను. పరిశీలించి ఆక్రమణకు గురై ఉంటే చర్యలు తీసుకుంటా. ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తే కచ్చితంగా స్పందిస్తాం. ఎప్పటికప్పుడు మా సిబ్బందిని కూడా అలర్ట్ చేస్తున్నాం.

– జయప్రకాష్, తహసీల్దార్, చిత్తూరు రూరల్

కోర్టులో ఉన్న భూమిపై కూటమి నేత పెత్తనం



న్యాయం జరగక పోతే ఆత్మహత్యే శరణ్యమని పెట్రోల్ క్యాన్‌తో నిరసన తెలుపుతున్న మహిళా రైతులు

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై అధికార పక్షానికి చెందిన నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతూ అధికారులను సైతం బెదిరింపులకు గురిచేస్తున్నారని సాతంబాకం రెవెన్యూ లెక్క దాఖలాలోని కొందరు రైతులు సోమవారం పెట్రోల్ క్యాన్‌తో నిరసన వ్యక్తం చేశారు. మహిళా రైతులు మాట్లాడుతూ పెనుమూరు మండలం, సాతంబాకం రెవెన్యూ పరిధిలోని సర్వే నం .39/1లో 1.79 సెంట్లు నాగేశ్వరరావు, భారతి పేరుతో ఉందన్నారు. అలాగే సర్వే నం.40లో 79 సెంట్లు జీఎస్.సుబ్రమణ్యంరెడ్డి పేరుతో ఉందన్నారు. తమ భూములకు ఆనుకుని అదే గ్రామానికి చెందిన కూటమి నేత సురేష్‌కు కొంత భూమి ఉండడంతో ఆ భూమికి దారి కల్పించాలని అధికారులపై దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ భూతగాదా ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. అయినప్పటికీ కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో తాము లేని సమయంలో జేసీబీ యంత్రాలతో చదును చేస్తూ అక్రమంగా దారి ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. అడితే తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకుంటే చావే శరణ్యమంటూ పెట్రోల్ క్యాన్‌తో నిరసన తెలిపారు.

దయ చూపండయ్యా!



గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటున్న సీపీఐ నాయకులు



కలెక్టర్‌కు దండం పెట్టి వేడుకుంటున్న అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్ : 'అయ్యా.. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతులు ఇస్తూనే ఉన్నాం.. దయ చేసి న్యాయం చేయండి' అంటూ వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు వేడుకున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్ ఎదుట తమ సమస్యల గోడును విన్నవించుకున్నారు. ఇదిలావుండగా పలు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ధర్నాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. వివిధ సమస్యలపై 292 అర్జీలు వచ్చినట్టు కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ వెల్లడించారు.

కార్పొరేట్ సెలూన్ షాపులను అరికట్టాలి

చిత్తూరులో కార్పొరేట్ సెలూన్ షాపులను అరికట్టాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయీ బ్రాహ్మణులు కలెక్టరేట్‌కు విచ్చేసి ధర్నా నిర్వహించారు. చిత్తూరులో అధిక సంఖ్యలో విచ్చల విడిగా కార్పొరేట్ సెలూన్ షాపులు పుట్టుకొస్తున్నాయన్నారు. వీటి వల్ల తమకు అన్యాయం జరుగుతోందన్నారు.

ఆత్మహత్యే శరణ్యం

పెనుమూరు తహసీల్దార్ వద్దకు ఎన్ని సార్లు తిరిగినా న్యాయం జరడం లేదని, తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని పెనుమూరు మండలం, శాతంబాకం గ్రామానికి చెందిన సురేష్, నదియా దంపతులు వాపోయారు. తమకున్న కొంత సాగుభూమికి వెళ్లే దారిని మూసి వేసి అగ్రకులస్తులు దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. మండల రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి దళితులమైన తమపై చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

యాదమరి మండలంలోని బుడితిరెడ్డిపల్లి ముస్లింవాడలో ఉండే మూడు ముస్లిం కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుడితిరెడ్డిపల్లి ముస్లింవాడలో ఓ కుటుంబానికి చెందిన ఒక మహిళను పెళ్లి చేస్తుకున్నారనే నెపంతో గ్రామ బహిష్కరణ చేశారన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని గ్రామ బహిష్కరణకు గురైన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మునెమ్మకు న్యాయం చేయాలి

గంగవరం మండలం, బూడిదిపల్లికి చెందిన దళిత మహిళ మునెమ్మకు న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద కేవీపీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా మునెమ్మ అనుభవంలో ఉన్న రేకుల షెడ్‌ను ప్రైవేట్ వాహనంతో తొలగించడం దారుణమన్నారు. ఈ సమస్యపై కలెక్టర్ స్పందిస్తూ వారంలోపు సమస్య పరిష్కరించాలని పలమనేరు ఆర్‌డీవోను ఆదేశించారు. లేని పక్షంలో తానే స్వయంగా వచ్చి బాధితులకు న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

జీతాలు పెంచాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులకు జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మెస్ బిల్లులను పెంచాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్నభోజన కార్మికుల జీతాల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. తమిళనాడు, కర్ణాటకలో జీతాలు పెంచారని, ఏపీలో మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

ప్రజల్లోకి 'సూపర్ జీఎస్టీ .. సూపర్ సేవింగ్స్'



మాట్లాడుతున్న శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథరెడ్డి

చిత్తూరు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథరెడ్డి, కమిషనర్ పి.నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమంపై ఆర్పీలు, సీవోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ.. నూతన జీఎస్టీ శ్లాబులు, సేవింగ్స్ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పనులు శాఖ డిప్యూటీ కమిషనర్ పరదేశి నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్, సహాయ కమిషనర్ ఏ.ప్రసాద్, ఎంహెచ్వో డా.లోకేష్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఇన్‌చార్జ్ సీఎంఎం గణేష్, పాల్గొన్నారు.

• నాయకులకేం తెలుసు.. మాకిన్ని కష్టాలని!



సమస్యల పరిష్కారం కోసం జిల్లా ప్రజలు కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా గ్రీవెన్స్‌లో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారమవుతుందని పలువురు ఆశపడుతున్నారు. వారాలు.. నెలలు.. సంవత్సరాల పాటు అర్జీలిచ్చి అలసిపోతున్నారు. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ క్రమంలో ఎక్కువ మంది వెళ్లి సమస్య విన్నవిస్తే త్వరగా పరిష్కారమవుతుందని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే పిల్లాజెల్లా అందరితో కలిసి కలెక్టరేట్‌కు తరలివచ్చేస్తున్నారు. ఇలాంటిదే సోమవారం కలెక్టరేట్‌లో కనిపించింది. చిత్తూరు నగర పరిధిలోని తేనెబండ వద్ద ఉన్న శ్రీనివాసపురానికి చెందిన గ్రామస్తులు తమ పిల్లలతోపాటు కలెక్టరేట్‌కు విచ్చేశారు. అధికారులకు సమస్యలు ఏకరువు పెట్టారు. వారితో వచ్చిన చిన్నారులు కలెక్టరేట్‌లో పెట్టిన ఉచిత భోజనాన్ని రుచి చూశారు. క్రమశిక్షణతో అందరూ కూర్చొని.. తింటున్న ఫొటోను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– చిత్తూరు కలెక్టరేట్.

ఇంత చిన్న చూపా?

- సచివాలయ ఉద్యోగులకు వలంటీర్ విధులు
- ఇంటింటి సర్వేలకు వెళ్తుంటే ఓటీపీలు చెప్పడం లేదు
- డిమాండ్లను పరిష్కరించాలి
- లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- కలెక్టరేట్ ఎదుట గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగులంటే ఎందుకంత చిన్న చూపని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రశ్నించింది. వలంటీర్లు చేయాల్సిన పనులను సచివాలయ ఉద్యోగులతో చేయించడం ఏ మాత్రం భావ్యం కాదని మండిపడింది. డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించింది. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం సమర్పించింది.

వలంటీర్ విధులు మాకొద్దు

వలంటీర్‌ల విధులు తమకొద్దని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు వినోద్ తేల్చిచెప్పారు. ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం వలంటీర్ పనులు అప్పగించి ఒత్తిడి చేయడం దారుణమన్నారు. సచివాలయ ఉద్యోగులకు కచ్చితమైన జాబ్‌చార్ట్ విడుదల చేయాలన్నారు. ప్రొబేషన్ 9 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ సర్వేల పేరుతో ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. డోర్ టు డోర్ సర్వేల నుంచి తమకు విముక్తి కల్పించాలన్నారు. ఇంటింటి సర్వేలకు వెళ్తుంటే ప్రజలు ఓటీపీ చెప్పడానికి ఇష్టపడడం లేదన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆ సంఘ సభ్యులు త్యాగరాజు, జానకీరామ్, బాలాజీ, అరుణకుమారి, జయశ్రీ, హరికృష్ణ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాల్సిందే



సచివాలయ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం కచ్చితంగా నెరవేర్చాలి. బకాయిలు వెంటనే విడుదల చేయాలి. డీఏ, నోషనల్ ఇంక్రిమెంట్స్, ఉద్యోగోన్నతుల ప్రక్రియను అమలు చేయాలి. వలంటీర్లు చేయాల్సిన పనులు అప్పగించడం దారుణం. మాతృశాఖలకు సచివాలయ ఉద్యోగులను విలీనం చేసి మంచి భవిష్యత్ కల్పించాలి.

– మహేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

అన్యాయం



సమస్యలను పరిష్కరించుకునేందుకే కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాం. కలెక్టర్ సర్‌కు మా సమస్య లను విన్నవించుకున్నాం. ఇంతకు ముందు వలంటీర్‌లు చేసే విధులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించి ఒత్తిడి చేయడం అన్యాయం. సర్వేలలో ప్రజలు ఓటీపీలు చెప్పేందుకు ఆసక్తి కనబరచడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సర్వేలు ఎలా చేయాలి..?.

– అరుణకుమారి, అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి

వినతులు ఇస్తూనే ఉన్నాం



మా సమస్యల పట్ల వినతులు ఇస్తూనే ఉన్నాం. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. న్యాయం కోసం జేఏసీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాం. మాపైన వివక్ష జరుగుతూనే ఉంది. ప్రభుత్వ ఉద్యోగులమని చెప్పుకోవడమే తప్ప ఎలాంటి ప్రయోజనాలు కలగడం లేదు. ప్రభుత్వం మాపై చిన్నచూపు చూడడం బాధాకరం.

– హరికిషన్, శానిటేషన్ కార్యదర్శి

ఈ కమిషనర్ మాకొద్దు



ఫొటోలతో ఏకరవు పెడుతున్న కౌన్సిలర్ హేమలత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు: 'ఈ కమిషనర్ మాకొద్దు.. ఈయన పచ్చ నేతలా వ్యవహరిస్తున్నాడు. మాకు సంబంధించిన బిల్లులు ఏవీ పాస్ చేయడం లేదు. ఈయన మాకు అవసరం లేదు' అంటూ పుత్తూరు మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్‌లో అజెండాలో తీర్మానం చేశారు. కమిషనర్, ఇతర అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ హరి అధ్యక్షతన జరిగింది. ప్రతి కౌన్సిలర్ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యల ఫొటోలను ప్రదర్శిస్తూ ఏకరవుపెట్టారు. కొన్ని సమస్యలు తమ పరిధిలో లేవంటూ దాటవేసిన కమిషనర్ మంజునాథ్‌గౌడ్ మిగిలిన అన్ని సమస్యలకు నిధులు లేవంటూ ముక్తసరిగా సమాధానం చెప్పారు. ఎమ్మెల్యే రూ.2 కోట్లు స్పెషల్ గ్రాంట్ మంజూరు చేయడంతో వర్కులకు టెండర్లు పిలిచామని తెలిపారు. దీనిపై చైర్మన్ హరి మాట్లాడుతూ పుత్తూరు మున్సిపాలిటీకి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్), ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద ప్రభుత్వం నుంచి రూ.4 కోట్లు రావాల్సి ఉండగా అందులో రూ.2 కోట్లు మంజూరైందన్నారు. ఆ నిధుల కోసం అప్రూవల్ పంపించిన కమిషనర్ పాలకమండలి రూ.80 లక్షలతో రూపొందించిన పనులకు అప్రూవల్ ఎందుకు పంపలేదని నిలదీశారు. టీడీపీ వార్డుల్లో మాత్రమే అభివృద్ధి పనులను చేపట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా మాజీ మంత్రి ఆర్కే రోజా అభివృద్ధి పనులు చేసి చూపెట్టారని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని జాతీయ రహదారుల కోసం రూ.2002 కోట్లను మంజూరు చేయించారన్నారు.

కమిషనర్‌కు కౌన్సిలర్లు వేసిన సూటి ప్రశ్నలు!

- 4వ వార్డు కౌన్సిలర్ కేశవాచ్చారి ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఎందుకు సమావేశాలకు అనుమతిస్తున్నారు..? అతనికి గౌరవవేతనం ఎలా ఇస్తున్నారు?
- పార్టీ మారిన ఇద్దరు కౌన్సిలర్లపై వైఎస్సార్‌సీపీ విప్ యాక్షన్ తీసుకోవాల్సింది ఉన్నా ఎందుకు స్పందించ లేదు?
- 2వ వార్డు తిమ్మాపురంలో ఏడాదిగా డ్రైనేజీ సమస్యను ఎందుకు పరిష్కరించ లేదు?
- ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్టు పోస్టు 4 నెలలుగా ఖాళీగా ఉండడంతో కాన్పులకు వస్తున్న మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గత ప్రభుత్వంలో రూ.2.4 కోట్లతో నిర్మించిన షాదీ మహల్‌ను ఎందుకు ప్రారంభించలేదు.
- వైఎస్సార్ మున్సిపల్ పార్కులో టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయమని పలు సమావేశాల్లో అడుగుతున్నా ఎందుకు ఏర్పాటు చేయలేదు?
- తిరుపతి రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని కోరినా ఎందుకు స్పందించ లేదు?
- కర్మక్రియల కోసం షెడ్ నిర్మించి ఏడాదిన్నర దాటినా ఇప్పటి వరకు బిల్లులు ఎందుకు మంజూరు చేయలేదు?

కొస మెరుపు

కాగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఎన్ని పనులకు టెండర్లు పిలిచారు? ఎన్ని పూర్తి చేశారు అంటూ కమిషనర్‌ను ప్రశ్నించగా ఒక్కటీ లేదంటూ టీడీపీ కౌన్సిలర్లే చెప్పడం విశేషం.